# సాక్షి
## మంచిర్యాల

సోమవారం : 26 : మే : 2025






### పంచ్ అదుర్స్!
మంచిర్యాలలో రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలు నిర్వహిస్తున్నారు. పోటీల్లో క్రీడాకారులు హోరాహోరీగా తలపడుతున్నారు. శక్తివంతమైన పంచ్‌లతో ఆకట్టుకుంటున్నారు. 8లో▸



### ప్రాణ రక్షకులు
108 అంబులెన్స్ పైలట్లు ప్రాణరక్షకులు. ప్రమాదం జరిగిందని సమాచారం అందగానే ఆస్పత్రికి తరలిస్తారు. జాతీయ అంబులెన్స్ పైలెట్ దినోత్సవం సందర్భంగా కథనం. 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
34.4 /26.6

### వాతావరణం
ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. ఉపరితల ఆవర్తనం ప్రభావంతో చాలాచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### స్పోర్ట్స్ హబ్‌గా మంచిర్యాల



ట్రోఫీ ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

**మంచిర్యాలటౌన్:** మంచిర్యాలను స్పోర్ట్స్ హబ్‌గా అభివృద్ధి చేస్తానని, ఇప్పటికే జిల్లా కేంద్రంలో స్టేడియం నిర్మాణానికి 11 ఎకరాల స్థలం కేటాయించి, రూ.45 కోట్ల నిధులు మంజూరు చేయించానని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఎఫ్‌సీఏ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలను ఆదివారం తిలకించారు. రాష్ట్రస్థాయి నుంచి పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చూడాలని ఉమ్మడి జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ సభ్యులకు సూచించారు. పోటీల్లో ఉత్తమ ప్రదర్శనతో విజేతలుగా నిలువాలని జిల్లా క్రీడాకారులకు సూచించారు. జిల్లా కేంద్రంలో నిర్మించే ఇండోర్ స్టేడియం పనులను ఈ ఏడాదిలోపు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. వచ్చే ఏడాది రాష్ట్రస్థాయి పోటీలు మంచిర్యాలలో నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. విద్య, వైద్యంతోపాటు, క్రీడలు కూడా ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. మంచిర్యాలను ఈ మూడురంగాల్లో ముందుండేలా చూస్తాని వెల్లడించారు. క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయస్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకులు, తాజా మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ అసోసియేషన్ల సభ్యులు పాల్గొన్నారు.

### జిల్లాలో 7.2 మి.మీల వర్షపాతం

**మంచిర్యాలఅగ్రికల్చర్:** జిల్లాలో శనివారం రాత్రి నుంచి అదివారం ఉదయం వరకు 7.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. లక్సెట్టిపేటలో 21.9 మిల్లి మీటర్లు, మంచిర్యాలలో 10.2, జైపూర్‌లో 13.2, వేమనపల్లిలో 9.2, జన్నారంలో 7, భీమినిలో 6.8, కన్నెపెల్లిలో 6.2, నెన్నెలలో 9, మందమర్రిలో 4.4, నస్పూర్‌లో 9.9, జైపూర్‌లో 13.2, కోటపల్లిలో 4, భీమారంలో 4.2, చెన్నూర్‌లో 3.8, బెల్లంపల్లిలో 3.1, కాసిపేటలో 5.1, తాండూర్‌లో 2.2, దండేపల్లిలో 0.7 మిల్లి మీటర్ల వర్షం కురిసింది.

### కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

**మంచిర్యాలఅర్బన్:** ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ఆదివారం కూడా కొనసాగాయి. జిల్లా వ్యాప్తంగా 16 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రథమ సంవత్సరం, మధ్యాహ్నం 2:30 నుంచి 5:30 వరకు ద్వితీయ సంవత్సరం పరీక్షలు నిర్వహించారు. ఆదివారం ఉదయం ప్రథమ సంవత్సరం గణితం, జువాలజీ, హిస్టరీ పరీక్షలకు 1,638 మందికి 1,563 మంది హాజరయ్యారు. 75 మంది గైర్హాజరయ్యారు. జనరల్ విద్యార్థులు 1,531 మందికి 1459 మంది విద్యార్థులు హాజరుకాగా, 72 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. వొకేషనల్ పరీక్షలకు 107 మందికి 104 మంది హాజరయ్యారు. ముగ్గురు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 760 మందికి 740 మంది హాజరయ్యారు. 20 మంది గైర్హాజరయ్యారు. జనరల్ విద్యార్థులు 668 మందికి 650 మంది హాజరుకాగా 18 మంది గైర్హాజరయ్యారు. వొకేషనల్‌లో 92 మందికి 90 మంది హాజరుకాగా ఇద్దరు గైర్హాజరైనట్లు డీఐఈవో అంజయ్య తెలిపారు.

### అక్కడి ధాన్యం ఇక్కడ విక్రయం!



మాట్లాడుతున్న రైతులు

**చెన్నూర్‌రూరల్:** మండలంలోని కత్తెరసాల పంచాయతీ పరిధిలోని సుబ్బరాంపల్లి గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఇతర ప్రాంతాల నుంచి తీసుకు వచ్చిన ధాన్యం విక్రయిస్తున్నారని స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు. కోటపల్లి మండలంతోపాటు మహారాష్ట్ర నుంచి కూడా ధాన్యం తీసుకువచ్చి స్థానిక రైతులపేరిట విక్రయిస్తున్నారని పేర్కొంటున్నారు. దీంతో స్థానికంగా కొనుగోళ్లు ఆలస్యమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం రాత్రి ఇతర ప్రాంతాల నుంచి తీసుకు వచ్చిన ధాన్యం లారీలో లోడ్ చేస్తున్న సమయంలో రైతులు అడ్డుకున్నారు. పోలీసులు, వ్యవసాయశాఖకు సమాచారం అందించారు. చెన్నూర్ సీఐ దేవేందర్ లారీని చెన్నూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. చెన్నూర్ పట్టణానికి ఒక ఉపాధ్యాయుడు సుబ్బరాంపల్లిలో తనకున్న భూమి లో పండించిన ధాన్యంతోపాటు కోటపల్లి మండలం జనగామ గ్రామం నుంచి ధాన్యం బస్తాలు తీసుకువచ్చి ఇక్కడ అమ్ముతున్నాడని తెలిపారు. వాటిని కొనుగోలు చేసిన కేంద్రం నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక రైతుల ధాన్యం ఉండగా ఇతర ధాన్యం ఎలా కొనుగోలు చేస్తారని నిలదీశారు. స్థానిక రైతుల పేరిటే ధాన్యం కొనుగోలు చేసినట్లు నిర్వాహకులు తెలుపడంతో లారీని వదిలిపెట్టారు.

# ముందే తొలకరి!



బెల్లంపల్లి డివిజన్‌లో దుక్కి దున్నుతున్న రైతు(ఫైల్)

- అకాల వర్షాలతో ఇప్పటికే చల్లబడిన వాతావరణం
- చల్లని కబురు చెప్పిన వాతావరణ శాఖ
- రోహిణితో వ్యవసాయ పనులు మరూ..

**మంచిర్యాలఅగ్రికల్చర్:** అల్పపీడన ద్రోణి ప్రభావంతో జిల్లాలో నాలుగైదు రోజులుగా ఆకాల వర్షాలు కురుస్తున్నాయి. గత వారం వరకు ఎండలు మండిపోగా, ఈ వర్షాలతో వాతావరణం చల్లబడింది. దీంతో ఇప్పటికే రైతులు పొలం బాట పడుతున్నారు. ఆదివారం రోహిణి కార్తె ప్రారంభంతో పూర్తిస్థాయిలో వానాకాలం సీజన్ ప్రారంభమైంది. ఈ క్రమంలో వాతావరణ శాఖ రైతులకు చల్లని కబురు చెప్పింది. ఈసారి నైరుతి రుతుపవనాలు ముందుగానే రానున్నట్లు పేర్కొంది. దీంతో జూన్ మొదటి వారంలో తొలకరి వర్షాలు పలకరిస్తాయని అంచనా వేసింది.

**సాగుకు రైతులు సన్నద్ధం..**

వానాకాలం సాగుకు రైతులు ఇప్పటికే సన్నద్ధమవుతున్నారు. వేసవి దుక్కులు దున్ని, చేలను సిద్ధం చేసుకుంటున్నారు. కొందరు రైతులు సేంద్రియ, కర్బన విత్తనాలు విత్తుకుంటున్నారు. జిల్లా వ్యవసాయ శాఖ ఈ వానాకాలం 3,33,565 ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయని అంచనా వేసింది.

**రైతులకు సూచనలు**

వ్యవసాయ అధికారులు ముందస్తు సాగుకు సిద్ధమవ్వాలని, విత్తనాలు, ఎరువులు, రుణాలు, పెట్టుబడి ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచిస్తున్నారు. సేంద్రియ ఎరువులైన జీలుగ, జనుము విత్తనాలకు ప్రభుత్వం రాయితీ అందిస్తోందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

ఈమేరకు ప్రణాళిక రూపొందించింది. అవసరమైన విత్తనాలు, ఎరువులను సిద్ధం చేసి రాయితీపై రైతులకు అందిస్తోంది. పచ్చిరొట్ట, సేంద్రియ ఎరువులు, జీలుగ, జనుము విత్తనాలను మండలాలకు తరలిస్తున్నారు.

**గతేడాది సవాళ్లు.. ఈ ఏడాది ఆశలు**

గత ఖరీఫ్‌లో వర్షాలు ఆలస్యంగా కురవడంతో రైతులు ప్రారంభంలో ఇబ్బందులు పడ్డారు. ఆలస్యంగా కురిసిన భారీ వర్షాలతో జలాశయాలు నిండినప్పటికీ, వానాకాలం సాగు ఆలస్యమైంది. దీని ప్రభావంతో యాసంగి పంటలు కూడా ఆలస్యమయ్యాయి. మార్చి, ఏప్రిల్‌లో రావాల్సిన దిగుబడి మే నెలలో కోతకు వచ్చింది. ఈ ఏడాది సాధారణ వర్షపాతం నమోదవుతుందని వాతావరణ నిపుణులు తెలుపడంతో రైతులు ఆశాభావంతో సాగుకు సిద్ధమవుతున్నారు.

**ఈ ఏడాది సాగు విస్తీర్ణం ఎకరాల్లో, విత్తనాలు, ఎరువులు**

| | |
|---|---|
| సాగు విస్తీర్ణం | 3,33,565 ఎకరాలు |
| పత్తి విత్తనాలు | 3,40,306 ప్యాకెట్లు |
| ఇతర విత్తనాలు | 32,324 క్వింటాళ్లు |
| రాయితీ విత్తనాలు | 7,690 క్వింటాళ్లు(జీలుగ, జనుము) |
| ఎరువులు | 1,10,205మెట్రిక్‌టన్నులు |

**వరి, పత్తికే ప్రాధాన్యం..**

గతేడాది 3,18,786 ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. ఈ ఏడాది 3,33,565 ఎకరాల్లో సాగు జరుగుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. పత్తి, వరి, పప్పు దినుసుల సాగును పెంచాలని ప్రభుత్వం సూచిస్తోంది. పత్తి సాగు 1,56,000 ఎకరాల నుంచి 1,58,753 ఎకరాలకు, వరి సాగు 1,60,000 ఎకరాల నుంచి 1,58,161 ఎకరాలకు, కందులు 1,054 ఎకరాలు, మొక్కజొన్న 531 ఎకరాలు, పెసలు 116 ఎకరాలు, మినుములు 69 ఎకరాలు, ఇతర పంటలు 14,881 ఎకరాల్లో సాగవుతాయని వ్యవసాయ శాఖ భావిస్తోంది. సాగుకు అనుగుణంగా విత్తనాలు, ఎరువుల ప్రణాళిక సిద్ధం చేసింది.

**వర్షపాతం అంచనాలు**

ఈ ఏడాది వానాకాలం సాధారణ వర్షపాతం నమోదవుతుందని వాతావరణ నిపుణులు తెలిపారు. జూన్‌లో 195.2 మిల్లీ మీటర్లు, జూలైలో 338.5 మిల్లీమీటర్లు, ఆగస్టులో 323.1 మిల్లీమీటర్లు, సెప్టెంబర్‌లో 130.4 మిల్లీమీటర్ల వర్షపాతం సాధారణంగా నమోదవుతుందని అంచనా. గడిచిన మూడేళ్లు వర్షాలు ఆలస్యంగా కురవడం, చివరన భారీ వర్షాలతో పంటలు దెబ్బతిన్నాయి. ఈ ఏడాది ముందస్తు రుతుపవనాలతో సాగు సమయానికి జరిగే అవకాశం ఉందని రైతులు పేర్కొంటున్నారు.

# ఆదాయం ఉన్నా అద్దె భవనంలోనే..



అద్దె భవనంలో ప్రస్తుతం కొనసాగుతున్న ఆర్టీవో కార్యాలయం ఇదే..

- రవాణా కార్యాలయానికి సొంత భవనం కరువు
- నస్పూర్‌లో ఐదేళ్ల క్రితం స్థలం కేటాయింపు..
- భవన నిర్మాణానికి రూ.9 కోట్ల అంచనా..
- తాజాగా జిల్లా కేంద్రానికి దూరంగా తరలింపునకు కసరత్తు

**మంచిర్యాలరూరల్(హాజీపూర్):** మంచిర్యాల జిల్లా రవాణా శాఖ ప్రభుత్వానికి గణనీయమైన ఆదాయాన్ని సమకూరుస్తుంది. అయినా సొంత భవనం లేకుండా హాజీపూర్ మండలం వేంపల్లి శివారులోని అద్దె భవనంలో కార్యాలయం నిర్వహిస్తున్నారు. ఐదేళ్లుగా సొంత భవనం నిర్మాణానికి ప్రయత్నాలు జరుగుతున్నా, ఎటువంటి పురోగతి సాధించలేదు. ఇటీవల నస్పూర్‌లో 5 ఎకరాల స్థలంలో కార్యాలయ నిర్మాణానికి చర్యలు మొదలయ్యాయి. అయితే ఐదెకరాలు ఎలా సరిపోతాయి అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

**స్థల కేటాయింపు సమస్యలు**

నస్పూర్‌లోని సర్వే నంబర్ 72లో 9.15 ఎకరాల స్థలం ఆర్టీవో కార్యాలయానికి కేటాయించగా, ఒక ఎకరం కస్తూరిబాగాంధీ బాలికల పాఠశాలకు, 2.20 ఎకరాలు జాతీయ రహదారి నిర్మాణానికి కేటాయించారు. మిగిలిన 5 ఎకరాల్లో కార్యాలయం, డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్, పార్కింగ్ వసతులు ఏర్పాటు సాధ్యమయ్యేలా కనిపించడం లేదు. గతంలో ఈ స్థలంలో ఒకరోజు వాహన ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించారు. తర్వాత ఎలాంటి కార్యకలాపాలు ఇక్కడ నిర్వహించడం లేదు.

**దూర భారం..**

నస్పూర్‌లో ఆర్టీవో కార్యాలయం నిర్మిస్తే జిల్లా కేంద్రం నుంచి 10 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. సంక్లిష్టమైన మార్గం కారణంగా గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే వాహనదారులు, నిరక్షరాస్యులు రిజిస్ట్రేషన్, లైసెన్స్, ఫిట్‌నెస్ కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంది.

**వాహనదారులకు ఇబ్బందులు లేకుండా..**



వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రవాణా సేవలు అందేలా చూస్తున్నాం. మరో నెలరోజుల్లో సీసీసీ పాతపోలీస్ స్టేషన్ పక్కన క్వార్టర్స్‌లోకి తాత్కాలికంగా ఆర్టీవో కార్యాలయాన్ని తరలిస్తాం. సిమెంట్ పనులతోపాటు విద్యుత్, పేయింట్ పనులు పూర్తి కావాల్సి ఉంది. సర్వర్, నెట్ సమస్యలు తలెత్తకుండా రవాణా శాఖ కమిషనర్ నుంచి తరలింపుకు ఆదేశాలు రాగానే సీసీసీలో కార్యకలాపాలు ప్రారంభిస్తాం.

– సంతోష్‌కుమార్, డీటీవో, మంచిర్యాల

**నిర్మాణానికి రూ.9 కోట్ల అంచనా**

ఆర్టీవో కార్యాలయ నిర్మాణానికి రూ.9 కోట్ల వ్యయం అవుతుందని రహదారులు, భవనాల శాఖ అంచనా వేసింది. ప్రస్తుత డీటీవో సంతోష్ నేతృత్వంలో నిర్మాణ పనులకు నివేదిక సిద్ధమై, అనుమతుల కోసం ఎదురుచూస్తోంది. అందుబాటులో ఉన్న వేంపల్లి, ముల్కల్ల, గుడిపేటలోని స్థలాలను పరిగణనలోకి తీసుకోకుండా నస్పూర్‌లో గందరగోళ స్థల ఎంపికపై విమర్శలు వస్తున్నాయి.

**తాత్కాలిక ఏర్పాటు**

సొంత భవనం నిర్మాణం పూర్తయ్యే వరకు రవాణా కార్యాలయాన్ని సీసీసీ సింగరేణి ప్రాంతంలోని పాత పోలీస్ స్టేషన్ పక్కన ఆర్టీవో కార్యాలయాన్ని తాత్కాలికంగా తరలించనున్నారు.

# పుష్కర మార్గంలో ఫుల్ ట్రాఫిక్!

- కాళేశ్వరం దారిలో పెరిగిన వాహనాలు..
- భీమారం సమీపంలో నాలుగు గంటలు నిలిచిన వాహనాలు




భీమారం సమీపంలో జాతీయరహదారిపై నిలిచిన వందలాది వాహనాలు

**భీమారం:** కాళేశ్వరం సమీపంలో నిర్వహిస్తున్న సరస్వతి పుష్కరాలకు భారీగా భక్తులు తరలివెళ్లారు. ఈ క్రమంలో మంచిర్యాల–చెన్నూరు జాతీయ రహదారి 63పై భీమారం సమీపంలోని జోడువాగు వద్ద భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. వంతెన కారణంగా ఉదయం 11 గంటల నుంచి దాదాపు నాలుగు గంటలపాటు వాహనాలు నిలిచిపోయాయి. దీంతో వందలాది వాహనాలు రహదారిపై నిలిచిపోయి, ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. చెన్నూరు, మంచిర్యాల నుంచి వచ్చే వాహనాలు ఒకేసారి ఇరుకు వంతెనపైకి చేరడంతో ఈ పరిస్థితి తలెత్తింది. భీమారం, కిష్టంపేట వైపు వాహనాలు గంటల తరబడి నిలిచిపోయాయి.

**పుష్కరాలతో పెరిగిన రద్దీ**

సరస్వతి పుష్కరాలు సోమవారం ముగియనున్న నేపథ్యంలో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. కరీంనగర్ మార్గంగుండా వచ్చిన భక్తులు, ఈసారి పుష్కర నిర్వాహకుల సూచనల మేరకు చెన్నూరు మీదుగా రావడంతో జాతీయ రహదారిపై వాహన రద్దీ గణనీయంగా పెరిగింది. జోడువాగు వద్ద సింగిల్ రోడ్డు, ఇరుకు వంతెన గురించి తెలియక వాహనాలు చొచ్చుకొచ్చాయని పోలీసులు తెలిపారు.

**పోలీసుల అలర్ట్..**

ట్రాఫిక్ జామ్‌ను క్లియర్ చేసేందుకు ఎస్సై శ్వేత నేతృత్వంలో పోలీసులు రంగంలోకి దిగారు. నాలుగు గంటలపాటు వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు, ముఖ్యంగా మంచినీటి కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మంచిర్యాల డీసీపీ భాస్కర్ జోడువాగు ప్రాంతాన్ని సందర్శించి, ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. జోడు వాగుల వద్ద సింగిల్ రోడ్డు, ఇరుకు వంతెన కారణంగా ట్రాఫిక్ జామ్ అయిందని డీసీపీ తెలిపారు.

# రోడ్లపై ప్రమాద ఘంటికలు



శ్రీరాంపూర్ రింగ్ రోడ్డుపై బోల్తాపడిన లారీ(ఫైల్)

- జిల్లాలో తగ్గని రోడ్డు ప్రమాదాలు
- పెరుగుతున్న మరణాలు..
- అజాగ్రత్తలు, నిర్లక్ష్యమే ప్రధాన కారణాలు

**సాక్షిప్రతినిధి, మంచిర్యాల:** జిల్లా రహదారులు నిత్యం నెత్తుటి చారలతో ఆందోళనకరంగా మారుతున్నాయి. జాతీయ రహదారుల విస్తరణతో వాహనాల వేగం పెరిగింది. దీనికితోడు అజాగ్రత్త, నిర్లక్ష్యపు డ్రైవింగ్ కారణంగా రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయి. మంచిర్యాల–ఆసిఫాబాద్ రహదారి (ఎన్‌హెచ్ 363)పై భారీ వాహనాలు, బైక్‌లు, కార్లు, ఆటోలు ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నాయి. వేసవిలో ప్రమాదాలు అధికమవుతుండగా, తీవ్రత పెరిగి మరణాలు సంభవిస్తున్నాయి.

**సౌకర్యాల కొరత, నిర్వహణలో జాప్యం**

శ్రీరాంపూర్ రింగ్ రోడ్డు వద్ద అటవీ అనుమతుల కొరతతో రోడ్డు నిర్మాణం నిలిచిపోయి, ప్రమాదకరంగా మారింది. గతంలో ఇక్కడ ఆర్టీసీ బస్సు ప్రమాదం జరిగింది. నస్పూర్ కృష్ణకాలనీ నుంచి దొరగారిపల్లె వరకు సర్వీస్ రోడ్లు, హై మాస్ట్ లైట్లు లేవు. సౌర విద్యుత్ వీధి లైట్లు పనిచేయక, రాత్రి వేళ వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాత మంచిర్యాల నుంచి రసూల్‌పల్లి వరకు బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించినప్పటికీ, డివైడర్లు, రేడియం స్టిక్కర్లు, సిగ్నల్స్ ఏర్పాటు చేయలేదు. గ్రామీణ రోడ్లపై గుంతలు, చెట్ల పొదలు, మట్టి ప్రమాదాలకు కారణమవుతున్నాయి.

**యాక్సిడెంట్ స్పాట్లు..**

బోయపల్లి, కన్నాల క్రాస్, సోమగూడెం చర్చి, బెల్లంపల్లి ప్రభుత్వాసుపత్రి నుంచి హనుమాన్ జంక్షన్ వరకు, మందమర్రి సమీపంలోని ఓవర్ బ్రిడ్జి వద్ద ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. మందమర్రి ఓవర్ బ్రిడ్జి, తదితర ప్రాంతాల్లో చాలాసార్లు లైట్లు వెలగడం లేదు. శ్రీరాంపూర్ రింగ్ రోడ్డు సమీపంలోనే అటవీ అనుమతులు లేకుండా నిలిచిపోయిన రోడ్డు ప్రమాదకరంగా మారింది. శ్రీరాంపూర్ వద్ద జంక్షన్‌లా నిర్మించి, హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాల్సి ఉన్నా, కేవలం సూచిక బోర్డులే ఏర్పాటు చేశారు. ఇక్కడ అనేక సార్లు ప్రమాదాలు జరిగాయి.

**రహదారి భద్రత కమిటీ నిర్లక్ష్యం**

రహదారి భద్రత కమిటీ ప్రమాద ప్రాంతాలను గుర్తించినప్పటికీ, క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవడం లేదు. పోలీసు, ఆర్టీఏ, రహదారుల ఇంజినీరింగ్, రెవెన్యూ, వైద్య శాఖల సమన్వయంతో రోడ్డు భద్రతను పర్యవేక్షించాలి. అత్యవసర హెల్ప్‌లైన్ 1033 తరచూ పనిచేయక, 108 సేవలే ఆధారంగా ఉన్నాయి. రోడ్డు నిర్వహణ, మరమ్మతుల్లో జాప్యం కొనసాగుతోంది.

**ప్రభుత్వ సాయంపై అవగాహన లోపం**

రోడ్డు ప్రమాద గాయపడిన వారికి కేంద్రం రూ.2 లక్షల సాయం అందిస్తుంది. దీనిపై ప్రచారం లేదు. జిల్లాకు ట్రామాకేర్ మంజూరైనా అందుబాటులో లేదు. ప్రభుత్వాస్పత్రిలో సౌకర్యాల కొరతతో గాయపడినవారిని కరీంనగర్, హైదరాబాద్ తరలిస్తున్నారు. రహదారి భద్రత, వైద్య సౌకర్యాలపై అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలి.

**జిల్లాలో 2024లో జరిగిన ప్రమాదాలు**

| | | | |
|---|---|---|---|
| మొత్తం ప్రమాదాలు | 453 | మృతి చెందిన వారు | 147 మంది |
| తీవ్రంగా గాయపడినవారు | 64 మంది | స్వల్పంగా గాయపడినవారు | 409 మంది |
| మొత్తం ప్రమాదాల బారిన పడినవారు | | 620 మంది | |

**ఈ ఏడాది జనవరి నుంచి మార్చి 31 వరకు..**

| | | | |
|---|---|---|---|
| మొత్తం ప్రమాదాలు | 125 | మృతులు | 43 |
| తీవ్రంగా గాయపనవారు | 16 మంది | స్వల్పంగా గాయపడినవారు | 101 మంది |
| ప్రమాదాల బారినవారు | 160 మంది | | |

# ‘ఈసెట్’లో బెల్లంపల్లి విద్యార్థుల ప్రతిభ




బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల

- మైనింగ్ విభాగంలో రాష్ట్రస్థాయి ర్యాంకులు

**బెల్లంపల్లి:** ఈసెట్–2025 పరీక్ష ఫలితాల్లో బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబర్చారు. నాలుగేళ్ల ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశానికి నిర్వహించిన ఈ పరీక్ష ఫలితాలు ఆదివారం ప్రకటించగా, మైనింగ్ ఇంజినీరింగ్ బ్రాంచ్‌లో ముగ్గురు విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారు. కుర్మ అక్షయ మైనింగ్ బ్రాంచ్‌లో 1వ ర్యాంకు, ఇంటిగ్రేటెడ్ ర్యాంకు 129 సాధించగా, పిప్పల వర్షిత్ 3వ ర్యాంకు, ఇంటిగ్రేటెడ్ ర్యాంకు 335, వడ్లకొండ మారుతిసాయి 4వ ర్యాంకు, ఇంటిగ్రేటెడ్ ర్యాంకు 365 సాధించాడు.

**గత వైభవం నిలబెట్టిన విద్యార్థులు**

బెల్లంపల్లి పాలిటెక్నిక్ కళాశాల గతంలో మెరుగైన విద్యాబోధనతో మంచి గుర్తింపు పొందింది. తర్వాత ఆస్థాయి కొనసాగలేదు. చాలా ఏళ్లకు మైనింగ్ బ్రాంచ్‌లో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించి కళాశాల ప్రతిష్ఠను నిలబెట్టారు. కొత్తగూడెం పాలిటెక్నిక్‌తో పోటీపడుతూ విద్యార్థులు అధ్యాపకుల ప్రోత్సాహంతో అత్యుత్తమ ఫలితాలు సాధించారు. ర్యాంకర్లు అక్షయ (పెద్దపల్లి), వర్షిత్ (హన్మకొండ), మారుతి సాయి (పెద్దపల్లి) నాన్–లోకల్ విద్యార్థులైనా పట్టుదలతో లక్ష్యాన్ని చేరుకున్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ దేవేందర్, అధ్యాపకులు అభినందించారు.

### ఐఐటీలో మైనింగ్ ఇంజినీరింగ్..



ఐఐటీలో మైనింగ్ ఇంజినీరింగ్ చదవాలనేది నా కోరిక. ఈసెట్ ఫలితాల్లో మై నింగ్ బ్రాంచ్‌లో ఫస్ట్ ర్యాంకు తెచ్చుకున్నట్లే జాతీయస్థాయిలో జరిగే గేట్‌లో కూడా మొదటి ర్యాంకు సాధించాలనే పట్టుదలతోఉన్నాను. మైనింగ్ బ్రాంచ్‌లో మొదటి ర్యాంకు రావడానికి అధ్యాపకులు చేసిన సూచనలు తోడ్పడ్డాయి. సింగరేణి లేదా కోలిండియాలో చేరి జీఎంగా ఎదగాలనేది నాఆశయం.

– కుర్మ అక్షయ, మైనింగ్ ఫస్ట్ ర్యాంకర్

### మైనింగ్‌లో పీహెచ్‌డీ చేస్తా..



ఉన్నత చదువులు చదవాలనేది నా ఆశయం. మైనింగ్ ఇంజనీర్‌గా ఉద్యోగం చేయాలనుకుంటున్నా. అందుకోసం కష్టపడతా. గేట్‌పరీక్ష రాసి ఉత్తమ ర్యాంకు సాధించి మైనింగ్ ఇంజనీరింగ్‌లో సీటు సాధిస్తా. మైనింగ్‌లో పీహెచ్‌డీ కూడా చేస్తా. ప్రతిష్టాత్మకమైన ఎన్‌టీపీసీ వంటి సంస్థలో ఉద్యోగం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నా.

– వర్షిత్, మైనింగ్ బ్రాంచ్ 3వ ర్యాంకర్

### కోలిండియాలో కొలువు సాధిస్తా..



కష్టపడి చదివితే ఏ పరీక్షలో అయినా విజయం సాధించవచ్చు. అధ్యాపకులు ఇచ్చిన సూచనలు పాటించడంతోపాటు శ్రద్ధగా చదవడంతో మైనింగ్ బ్రాంచ్‌లో నాకు 4వ ర్యాంకు వచ్చింది. బీటెక్ పూర్తి చేసి కోలిండియాలో మైనింగ్ ఇంజనీర్‌గా ఉద్యోగం సాధించాలనేది నా లక్ష్యం.

– వడ్ల కొండ మారుతి సాయి, మైనింగ్ బ్రాంచ్ 4వ ర్యాంకర్

## క్లుప్తంగా

### ఐచర్ వ్యాన్ బోల్తా

**ఇచ్చోడ:** మండలకేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఆదివారం ఉదయం ప్రమాదవశాత్తు ఐచర్ వ్యాన్ కాలువలో బోల్తాపడింది. గోదాంల నుంచి ఐచర్ వ్యాన్ రోడ్డుపై వస్తుండగా కల్వర్టుపై ఉన్న మట్టి కూలడంతో ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో డ్రైవర్ చాకచాక్యంగా ప్రమాదం నుంచి బయటపడ్డాడు.

### రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

**మంచిర్యాలక్రైం:** మంచిర్యాల–రవీంద్రఖని మధ్య ఆదివారం ఉదయం రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ సంపత్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మృతుడి వయస్సు (35) ఉంటుందని, అతని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. కుడిచేతిపై కరుణ శ్రీ అని ఇంగ్లిష్‌లో టాటు వేసి ఉంది. మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రిలోని మార్చురీలో భద్రపరిచినట్లు పేర్కొన్నారు. వివరాలకు సెల్ 8712658596, 8328512176 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

### నిర్మల్‌లో దొంగల హల్‌చల్

**నిర్మల్‌టౌన్:** పట్టణంలో శనివారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. పలు దుకాణాల్లో చొరబడి నగదు ఎత్తుకెళ్లారు. ఆదివారం ఉదయం షాపులకు వెళ్లిన యజమానులకు షటర్ల తాళాలు పగులగొట్టి ఉండడంతో షాకయ్యారు. స్థానిక బస్టాండ్ ప్రాంతంలోని ఓ కిరాణాషాపులో రూ.60 వేల నగదును ఎత్తుకెళ్లారు. బస్టాండ్ ఏరియాలోని ఓ మెడికల్ షాపులో, ఈద్గా చౌరస్తాలోని మరో మెడికల్ షాపులో నగదు ఎత్తుకెళ్లారు. ఈమేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటన స్థలాన్ని పరిశీలించారు. క్లూస్‌టీంతో ఆధారాలు సేకరించారు. చోరీపై కేసు దర్యాప్తు చేపట్టారు.

**వైన్స్‌లో చోరీ**

**ముధోల్:** స్థానిక శ్రీరాజరాజేశ్వర వైన్స్‌లో చోరీ జరిగింది. ప్రతీరోజు మాదిరిగా శనివారం రాత్రి వైన్స్‌కి యజమాని తాళం వేసి వెళ్లారు. ఆదివారం ఉదయం వైన్స్ షాపు తెరవగా వెనుక భాగంలో రేకులు తొలగించి ఉంది. రూ.2.56 లక్షల విలువ గల మద్యం, రూ.19 వేల నగదుతోపాటు సీసీటీవీ డీవీఆర్‌ను గుర్తుతెలియని దొంగలు ఎత్తుకెళ్లారు. యజమాని వెంటనే సమాచారమివ్వడంతో సీఐ మల్లేశ్ అక్కడికి చేరుకుని పరిశీలించారు. క్లూస్‌టీం సిబ్బంది వివరాలు సేకరించారు.

### నకిలీ విత్తనాలపై ఉక్కుపాదం

**ఇచ్చోడ:** నకిలీ విత్తనాలపై ఉక్కుపాదం మోపుతామని ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్ అన్నారు. ఆదివారం తన కార్యాలయంలో ఈ మేరకు వివరాలు వెల్లడించారు. ఇచ్చోడ ఏవో రమేశ్ ఫిర్యాదుతో శనివారం సాయంత్రం జాదవ్ గజానంద్ ఇంటిపై పోలీసులు దాడి నిర్వహించగా, 9 తిలక్ 5జీ నకిలీ విత్తన ప్యాకెట్లు లభించాయి. అతన్ని విచారించగా కోకస్‌మన్నూర్‌కు చెందిన ఇద్దరు విక్రయించారని చెప్పాడు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆ గ్రామానికి వెళ్లి కె.శివకుమార్, కొతపల్లి రవీందర్ నుంచి విక్రాంత్–44కు సంబంధించి 39 నకిలీ విత్తన ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని, ఆ ఇద్దరిని అరెస్టు చేశారు. మళ్లీ జాదవ్ గజానంద్‌ను విచారించగా ముక్రా(బి)కి చెందిన ఆదవ్ రవికాంత్ నుంచి నకిలీవిత్తనాలు కొనుగోలు చేసి రైతులకు విక్రయిస్తున్నట్లు తెలిపాడు. రవికాంత్ మహారాష్ట్ర నుంచి నకిలీ విత్తనాలు తీసుకువచ్చి గజానంద్ ద్వారా రైతులకు విక్రయిస్తున్నారని ఏఎస్పీ పేర్కొన్నారు. రవికాంత్ పరారీలో ఉన్నారన్నారు. ఈ నలుగురిపై ఇచ్చోడలో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



# పంచ్ అదుర్స్!

- మంచిర్యాలలో రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలు
- 260 మంది క్రీడాకారులు హాజరు..
- హోరాహోరీగా తలపడుతున్న బాక్సర్లు



బాక్సింగ్‌లో తలపడుతున్న క్రీడాకారులు



విజేతను ప్రకటిస్తున్న ఎంపైర్

**మంచిర్యాలటౌన్:** మంచిర్యాల జిల్లా కేంద్రం రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు వేదికగా నిలిచింది. ఉమ్మడి జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ (బాక్సింగ్ ఫెడరేషన్ అనుబంధం) పర్యవేక్షణలో ఈనెల 24న ప్రారంభమైన ఈ పోటీలు 26 వరకు కొనసాగనున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 260 మంది బాక్సింగ్ క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటున్నారు. వయస్సు, బరువు ఆధారంగా విభజించిన విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. క్రీడాకారులు హోరాహోరీగా తలపడుతూ శక్తివంతమైన పంచ్‌లతో ఆకట్టుకుంటున్నారు.

**టైసన్ బాక్సింగ్ క్లబ్ ఏర్పాట్లు**

పోటీలను తిలకించేందుకు పెద్దఎత్తున ప్రేక్షకులు తరలివస్తున్నారు. టైసన్ బాక్సింగ్ క్లబ్ క్రీడాకారులకు వసతి, ఇతర సౌకర్యాలు కల్పించి, లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేసింది. రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు పాల్గొనడంతో పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. యువ క్రీడాకారులకు తమ ప్రతిభను ప్రదర్శించే వేదికగా నిలిచింది. ఈ సందర్భంగా పలువురి క్రీడాకారులను 'సాక్షి'పలకరించగా తమ అనుభవాలు వెల్లడించారు.

### నాలుగేళ్లుగా శిక్షణ



గత నాలుగేళ్లుగా బాక్సింగ్‌లో శిక్షణ పొందుతున్నాను. 9వ తరగతి చదువుతున్నా నాకు ఎస్జీఎఫ్, ఓపెన్ స్టేట్ బాక్సింగ్ పోటీల్లో ఆడేందుకు అవకాశం వచ్చింది. ద్వితీయ, తృతీయ స్థానాలతోనే సరిపెట్టుకున్నాను. ప్రస్తుతం మంచిర్యాల ఖేలో ఇండియాలో బాక్సింగ్‌లో శిక్షణ పొందుతూ రాష్ట్రస్థాయి పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించడమే లక్ష్యంగా శిక్షణ పొందాను. హైదరాబాద్ వారితో ఈ పోటీల్లో గెలుపొందడం ఆనందంగా ఉంది. – ఎండీ ఉబైద్ ఖాన్, మంచిర్యాల

### బాక్సింగ్‌లో రాణించాలి



మంచిర్యాల ఖేలో ఇండియా బాక్సింగ్ శిక్షణ పొందుతున్నాను. 9వ తరగతి చదువుతున్న తాను అండర్ 14–విభాగంలో ఎస్జీఎఫ్ జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నాను. రాష్ట్రస్థాయి పోటీల్లో, ఓపెన్ స్టేట్ బాక్సింగ్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించాను. ప్రస్తుతం జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లోనూ గోల్డ్‌మెడల్‌ను సాధిస్తాను. – అనురాగ్, మంచిర్యాల

### బాక్సింగ్ అంటే ఇష్టం



బాక్సింగ్ అంటే చాలా ఇష్టం. ఇంటర్ ఫస్టియర్ పూర్తయింది. ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీల్లో రెండుసార్లు పాల్గొని ఒకసారి గోల్డ్, మరోసారి సిల్వర్ మెడల్స్ సాధించాను. జాతీయస్థాయిలో ఒకసారి పాల్గొన్నాను. రాష్ట్ర, జాతీయ స్థాయిలోని పోటీల్లో పాల్గొని గోల్డ్‌మెడల్‌ను సాధించాలనే లక్ష్యంతో వచ్చాను. – పి.పవన్, హైదరాబాద్

### సత్తాచాటుతూ..



పదో తరగతి చదువుతున్న నాకు రాష్ట్ర, జాతీయస్థాయి బాక్సింగ్ పోటీల్లో శిక్షణ పొందుతున్నాను. నాలుగేళ్లుగా బాక్సింగ్‌లో శిక్షణ పొందుతూ ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీల్లో రెండుసార్లు ఆడేందుకు అవకాశం రాగా, ఒకసారి గోల్డ్‌మెడల్ సాధించాను. జాతీయస్థాయిలో రెండుసార్లు ఆడేందుకు అవకాశం వచ్చింది. రాష్ట్ర, జాతీయస్థాయిలో సత్తాచాటి గోల్డ్‌మెడల్స్‌ను సాధిస్తాను. – జి.శ్రీనాథ్, మంచిర్యాల

### మరోసారి సత్తా చాటుతా..



ఇటీవల పదో తరగతి పూర్తయింది. మంచిర్యాలలోని ఖేలో ఇండియా ద్వారా బాక్సింగ్‌లో రెండేళ్లుగా శిక్షణ పొందుతున్నాను. ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీల్లో రెండుసార్లు పాల్గొని సిల్వర్, బ్రాంజ్ పతకాలు సాధించాను. సీఎంకప్ రాష్ట్రస్థాయి పోటీల్లో గోల్డ్ పతకం సాధించగా, ఓపెన్ స్టేట్ బాక్సింగ్ రాష్ట్రస్థాయి పోటీల్లో మూడో స్థానంలో నిలిచాను. జాతీయస్థాయిలో ఆడినా పతకం అందుకోలేకపోయాను. మంచిర్యాలలో నిర్వహిస్తున్న పోటీల్లో గోల్డ్ పతకం సాధిస్తాను. – క్రితి అగర్వాల్, మంచిర్యాల

### జాతీయస్థాయిలో రాణిస్తా



ఆదిలాబాద్ స్పోర్ట్స్ స్కూల్‌లో ఇటీవల టెన్త్ చదివాను. రాష్ట్రస్థాయిలో ఎస్జీఎఫ్‌లో రెండు గోల్డ్‌మెడల్స్ సాధించాను. బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి పోటీల్లో 46, 48 కేజీల విభాగంలో గోల్డ్‌మెడల్స్ సాధించాను. జాతీయస్థాయి పోటీల్లో నాలుగుసార్లు పాల్గొనగా ఒకసారి దేశంలోనే 8వ స్థానంలో నిలిచాను. జాతీయస్థాయిలో గోల్డ్‌మెడల్ సాధించడమే లక్ష్యంగా శిక్షణ పొందుతున్నాను. – నిహారిక, నిజామాబాద్

### గోల్డ్‌మెడల్ సాధిస్తా



రాష్ట్రస్థాయిలో సబ్ జూనియర్ బాక్సింగ్ పోటీల్లో, ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీల్లో గోల్డ్‌మెడల్స్ సాధించాను. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, గోవాకు ఎంపికయ్యాను. పదోతరగతి ఇటీవల పూర్తి చేయగా, 8వ తరగతి నుంచే బాక్సింగ్‌లో శిక్షణ పొందుతున్నా. జాతీయస్థాయిలో పాల్గొని గోల్డ్‌మెడల్‌ను సాధించాలనే లక్ష్యంతో శిక్షణ పొందుతున్నాను. – జి.అనుగ్రహ, హైదరాబాద్

### జాతీయస్థాయిలో ఆడేందుకు శిక్షణ



ఇటీవల ఇంటర్ పూర్తయింది. నాలుగుసార్లు రాష్ట్రస్థాయి పోటీల్లో ఆడి గోల్డ్‌మెడల్ సాధించాను. జాతీయస్థాయిలో ఒకసారి ఆడి, సెమీఫైనల్ చేరాను. ఫైనల్ చేరేలా శిక్షణ తీసుకుంటూనే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటున్నా. జాతీయస్థాయిలో రాణించేలా బాక్సింగ్‌లో శిక్షణ పొందుతున్నా. – సంస్కృతి, మంచిర్యాల

### ఇంద్రాదేవి ఆలయంలో విత్తన పూజలు



ఇంద్రాదేవికి మొక్కుతున్న ఆదివాసీలు

**ఇంద్రవెల్లి:** ఖరీఫ్‌సీజన్ నేపథ్యంలో ఇంద్రాదేవి ఆలయంలో ఆదివాసీలు విత్తన పూజలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చి విత్తన పూజలు చేశారు. అమ్మవారికి నవధాన్యాలతో నైవేద్యాలు సమర్పించారు. ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు పుష్కలంగా కురవాలని పంటలు బాగా పండాలని అమ్మవారిని మొక్కుకున్నారు. ఆలయ మహారాజ్ చహకటి సూర్యరావ్, ఆయా గ్రామాల ఆదివాసీలు ఉన్నారు.

### 108లో ప్రసవం



శిశువుతో కుటుంబ సభ్యులు, 108 సిబ్బంది

**బెల్లంపల్లి:** పురిటినొప్పులతో బాధపడుతున్న 8 నెలల గర్భిణికి 108 సిబ్బంది ఎంతో నేర్పుతో ఆదివారం ప్రసవం చేశారు. కుమురం భీం జిల్లాలోని భీమన్‌గూడ మారుమూల గిరిజన గ్రామానికి చెందిన ఆత్రం పోసుబాయికి పురిటినొప్పులు వచ్చాయి. ఆశ కార్యకర్త సహాయంతో కుటుంబీకులు 108 అంబులెన్స్‌లో ఆసిఫాబాద్ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ఆమెను పరీక్షించిన వైద్యులు బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియాస్పత్రికి రెఫర్ చేయడంతో అక్కడికి తీసుకెళ్లారు. 8 నెలల గర్భిణి, రక్తం తక్కువగా ఉండటం, ఐదో కాన్పు కావడంతో అక్కడి వైద్యులు మంచిర్యాలకు రెఫర్ చేశారు. వెంటనే పోసుబాయిని మంచిర్యాల మాతా శిశు ఆసుపత్రికి తీసుకెళ్తుండగా సోమగూడెం శివారుప్రాంతంలో ఆమెకు పురిటి నొప్పులు ఎక్కువయ్యాయి. రోడ్డు పక్కన అంబులెన్స్‌ను నిలిపి ఈఆర్‌సీపీ వైద్యుడి సలహాతో ఈఎంటీ దుర్గం ఆత్మారావు, పైలెట్ అజయ్ ఆమెకు నార్మల్ డెలివరీ చేయగా పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డలు క్షేమంగా ఆరోగ్యంగా ఉన్నారు. వారిని మంచిర్యాల మాతా శిశు కేంద్రానికి తరలించారు. బెల్లంపల్లి 108 అంబులెన్స్ ఈఎంటీ, పైలెట్‌ను కుటుంబీకులు, ఆసుపత్రి సిబ్బంది అభినందించారు.

# సీనియర్ జర్నలిస్ట్ మునీర్ మృతి



మునీర్(ఫైల్)



నివాళులర్పిస్తున్న టీయూడబ్ల్యూజే ఐజేయూ జిల్లా అధ్యక్షుడు దేగ సత్యం, సభ్యులు

**మందమర్రిరూరల్/పాత మంచిర్యాల:** మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ ఎండీ మునీర్ (69) అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఆదివారం ఉదయం మృతిచెందారు. నెల రోజులుగా ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించి కన్నుమూశారు. ఆయన పార్థివదేహాన్ని మంచిర్యాలలోని నివాసానికి తీసుకువచ్చారు. మధ్యాహ్నం వరకు సందర్శనార్థం అక్కడే ఉంచారు. పలువురు ప్రజాప్రతినిధులు నివాళులర్పించారు. అంత్యక్రియల కోసం పార్థివదేహాన్ని సాయంత్రం మందమర్రిలోని సీఈఆర్ క్లబ్ మీదుగా ఈద్గాకు తరలించారు. అక్కడ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎమ్మెల్సీ కోదండరామ్, యూనియన్ నేతలు, స్నేహితులు, తోటి పాత్రికేయులు, రాజకీయనాయకులు, అభిమానులు నివాళులర్పించారు.

**ఉద్యమకారుడిగా, జర్నలిస్ట్‌గా ప్రస్థానం**

మునీర్ ఉద్యమకారుడిగా, జర్నలిస్ట్‌గా జిల్లాలో చెరగని ముద్రవేశారు. విద్యార్థి దశలో ఏఐఎస్‌ఎఫ్‌లో పనిచేసి, సీపీఐలో చురుకైన నాయకుడిగా ప్రజాపోరాటాల్లో పాల్గొన్నారు. 1981లో సింగరేణిలో కార్మికుడిగా చేరి, భూస్వాముల అరాచకాలపై పోరాటాలు చేశారు. 1982లో హత్య కేసులో నిందితుడిగా శిక్ష పొందినా, హైకోర్టు కేసును కొట్టివేసింది. ఇక జర్నలిస్టుగా వివిధ పత్రికల్లో 40 ఏళ్లు పనిచేశారు. 2008లో సింగరేణి గోల్డెన్ హ్యాండ్‌షేక్ పథకం ద్వారా ఉద్యోగ విరమణ పొంది, జర్నలిజంలో కొనసాగారు. తెలంగాణ ఉద్యమంలో సింగరేణి కార్మిక సంఘాల జేఏసీ చైర్మన్‌గా సమ్మెను విజయవంతం చేశారు.

**పలువురి నివాళి**

మునీర్ మృతికి పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్, మాజీ ఎమ్మెల్యేలు దివాకర్‌రావు, కోనేరు కోనప్ప, ఐఎన్టీయూసీ జనరల్ సెక్రటరీ జనక్‌ప్రసాద్ తదితరులు సంతాపం తెలిపారు. ఆయన కుటుంబానికి సానుభూతి వ్యక్తంచేశారు. మునీర్‌కు భార్య రిజ్వానా, కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

# ప్రాణ రక్షకులు

- ప్రమాద స్థలాలకు క్షణాల్లో చేరుతున్న పైలెట్లు
- క్షతగాత్రులను ఆసుపత్రికి తరలింపు..
- వైద్య చికిత్సతో నిలబెడుతున్న ప్రాణాలు
- నేడు జాతీయ పైలెట్ దినోత్సవం



ఉమ్మడి జిల్లాలో..

| జిల్లా | అంబులెన్సులు | పైలెట్ |
|---|---|---|
| మంచిర్యాల | 18 | 45 |
| అదిలాబాద్ | 25 | 60 |
| నిర్మల్ | 15 | 36 |
| కుమురం భీం | 15 | 35 |

**చెన్నూర్:** 108 అంబులెన్స్ పైలట్లు ప్రాణరక్షకులని.. ప్రమాదం జరిగిందని సమాచారం వస్తే చాలు క్షణాల్లో అక్కడికి చేరుకుంటారు. క్షతగాత్రులను వెంటనే ఆసుపత్రికి తరలిస్తున్నారు. సకాలంలో వైద్య చికిత్స అందించడంతో వారి ప్రాణాలను కాపాడగలుగుతున్నారు. పైలట్ల సేవలను పలువురు కొనియాడుతున్నారు. సోమవారం జాతీయ అంబులెన్స్ పైలెట్ దినోత్సవం సందర్భంగా సాక్షి కథనం.

**ఉమ్మడి జిల్లాలో..**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 73 అంబులెన్స్‌లు పని చేస్తున్నాయి. 176 మంది పైలెట్లు విధులు నిర్వహిస్తున్నారు. అంబులెన్స్‌లు ఆయా మండలాల పరిధిలో జరిగే రోడ్డు, ఇతర ప్రమాదాలు జరిగిన సమయంలో సంఘటన స్థలాలకు చేరుకుని క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలిస్తున్నారు. పైలెట్లు ప్రమాద స్థలాలకు చేరుకునేందుకు వారి ప్రాణాలను సైతం ఫణంగా పెడుతున్నారు.

### ఉద్యోగం సంతృప్తినిస్తోంది



పైలెట్‌గా సుమారు 18 ఏళ్లుగా పని చేస్తున్నా. ఈ ఉద్యోగం కత్తిమీద సాము లాంటిది. రాత్రి, పగలనక విధులు నిర్వహించాలి. ఎప్పుడు అప్రమత్తంగా ఉండాలి. ఫోన్‌కాల్ వస్తేచాలు క్షణాల్లో అక్కడికి చేరుకోవాలి. వారి ఆరోగ్య పరిస్థితిని అధికారులకు వివరిస్తూ ఆసుపత్రికి తరలిస్తాం. ఈ ఉద్యోగం చేయడం సంతృప్తినిస్తోంది. – కుమారస్వామి, పైలెట్ చెన్నూర్

# నాట్య మయూరాలు

- నృత్యంలో రాణిస్తున్న చిన్నారులు
- మహా బృంద నాట్యంలో పాల్గొని గిన్నిస్ రికార్డు
- బాలకేంద్రం చిన్నారుల ప్రతిభ




గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ధ్రువపత్రం, మెడల్



గిన్నిస్ రికార్డు సాధించిన బాలకేంద్రం చిన్నారులతో కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్:** చిన్నారులు ఆయా వేదికల్లో శాస్త్రీయ నృత్యంలో ప్రతిభ కనబరుస్తున్నారు. అందులోనే రాణిస్తూ తమకంటూ ఓ ప్రత్యేకతను చాటుతున్నారు. వారే జిల్లా కేంద్రంలోని బాల కేంద్రంలో కూచిపూడి నృత్యంలో శిక్షణ తీసుకుంటూ గిన్నిస్ రికార్డులకెక్కిన చిన్నారులు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి జీఎంసీ బాలయోగి స్టేడియం వేదికగా భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో 2023 డిసెంబర్ 24, 25వ తేదీల్లో కూచిపూడి కళా వైభవం –మహా బృందనాట్యం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ప్రదర్శనలో 4,218 మంది నృత్యకారిణులు ఒకేసారి ప్రదర్శించి గిన్నిస్ రికార్డు సాధించారు. వారిలో బాల కేంద్రానికి చెందిన 26 మంది కూచిపూడి చిన్నారి నర్తకులు ఉండడం విశేషం.

**గిన్నిస్ రికార్డు సాధించిన చిన్నారులు..**

గడ్డం శ్రీనిధి, దువాస హర్షిని, పన్నాల లాస్య, ఠాకూర్ హర్షిని, అక్షర గీత, క్షీరసాగర్ జాహ్నవి, సన్నిధి దేశ్ముఖ్, కుర్ర భవిష్య, జాబు శ్రీ వర్ధిని, ఆర్. ఓజస్విని, నాలంవార్ మహాలక్ష్మి, గుండేటి అశ్విత, ఉపలంచివార్ అక్షిత, కొంకటి ఇతీక్ష, పోలాజి ఉమారాణి, మోర శ్రేష్ఠ, సామ మహతి, చిలుక ఆమని, మామిడి అక్షయ, అవరగొండ సంజన, యానాకి నక్షత్ర, మచ్చ సాత్విక, కటకం భావనశైని, కొంద్ర అలేఖ్య, కానిందే మహాశ్రీ, రామోజీ రచన.

### నాట్యశిఖామణి 'ఆమని'



కైలాస్‌నగర్ కాలనీకి చెందిన చిలుక వెంకటస్వామి–అన్నపూర్ణ దంపతుల కుమార్తె ఆమని 2021 నుంచి బాలకేంద్రంలో కూచిపూడి నృత్యంలో సర్టిఫికెట్ కోర్సు చేస్తూ ఎన్నో వేదికల్లో ప్రదర్శనలు ఇచ్చింది. అద్భుత కళా నైపుణ్యంతో అన్నమయ్య పురస్కారాన్ని సాధించింది. ఇప్పటివరకు 10 రికార్డులు సొంతం చేసుకుంది. గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డు ఈవెంట్లో పాల్గొని ధ్రువపత్రాన్ని అందుకుంది.

### రాణిస్తున్న 'జాహ్నవి'



జిల్లా కేంద్రంలోని తిరుమలనగర్ కాలనీకి చెందిన కె.జాహ్నవి ఏడో తరగతి చదువుతోంది. 2022 నుంచి బాలకేంద్రంలో కూచిపూడి నృత్యంలో శిక్షణ తీసుకుంటూ రాణిస్తోంది. చిన్ననాటి నుంచే నృత్యంపై ఆసక్తితో శిక్షణలో చేర్పించినట్లు తల్లిదండ్రులు సంజుతాయి– రవికుమార్ తెలిపారు. ఇప్పటివరకు ఆరు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనడమే కాకుండా 7 రాష్ట్రస్థాయి నృత్య పోటీల్లో ప్రదర్శనలు ఇచ్చింది. మహారాష్ట్ర వార్ధాలో జరిగిన నృత్య పోటీల్లో పాల్గొని ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచింది. కళాశక్తి పురస్కారంతోపాటు గిన్నిస్ వరల్డ్ రికార్డ్ ఈవెంట్‌లో పాల్గొని ధ్రువపత్రం అందుకుంది.

### పురస్కారాల నిధి 'సన్నిధి'



టైలర్స్ కాలనీకి చెందిన దేశ్ముఖ్ కృష్ణమోహన్ –ఉమామహేశ్వరి దంపతుల కుమార్తె సన్నిధి కూచిపూడిలో రాణిస్తూ ఇప్పటివరకు 40 పురస్కారాలు అందుకుంది. ఇప్పటివరకు 16 రాష్ట్రస్థాయి నృత్య పోటీల్లో పాల్గొనగా అన్నింట్లో ప్రత్యేకతను చాటుకుంది. 2022 నుంచి శిక్షణ పొందుతూ గిన్నిస్ వరల్డ్ రికార్డ్ ఈవెంట్లో ధ్రువపత్రాన్ని అందుకుంది. భవిష్యత్తులో గొప్ప కూచిపూడి నాట్యకారిణిగా ఎదగాలని ఆకాంక్షిస్తుంది.

### రికార్డుల 'హర్షిణి'



జిల్లా కేంద్రంలోని ఠాకూర్ ప్రదీప్ సింగ్– అనూష దంపతుల కుమార్తె హర్షిణి కూచిపూడి నృత్యంలో అరుదైన రికార్డులను సాధిస్తుంది. 2022 నుంచి ఇప్పటివరకు 11 అరుదైన రికార్డులు సొంతం చేసుకుంది. 2022లో వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్, 2023లో తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఫెంటాస్టిక్ అచీవ్మెంట్స్ అండ్ రికార్డ్స్, జీమ్స్ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇండియా రికార్డ్స్ దక్కాయి. ఇప్పటివరకు 408 పైగా జాతీయ, రాష్ట్ర, జిల్లాస్థాయి వేదికలపై అద్భుత ప్రదర్శనలు ఇచ్చింది. తల్లి ప్రోత్సాహంతో రాణిస్తున్నానని హర్షిణి తెలిపింది.

# శత జన్మదిన సందడి

- వాగ్దారిలో ఓ వృద్ధుడి వందో పుట్టినరోజు వేడుక



వేడుకల్లో పాల్గొన్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు

**నేరడిగొండ:** మండలంలోని వాగ్దారి గ్రామానికి చెందిన ఓ వృద్ధుడి శత జన్మదిన సంబురం కుటుంబ సభ్యులు, గ్రామస్తుల మధ్య ఆదివారం అట్టహాసంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన బదావత్ కిర్యానాయక్ 1925 మే 24న జన్మించాడు. శనివారంతో వందేళ్లు పూర్తికాగా కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామస్తుల సమక్షంలో ఆదివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కిర్యానాయక్ కేక్ కట్ చేశారు. తన ఆరోగ్యానికి జీవనశైలే కారణమని పేర్కొన్నాడు. కార్యక్రమంలో ఐదు తరాల వారసులు పాల్గొని సందడి చేశారు.

### క్రిమిసంహారక నీటిని తాగి జీవాలు మృతి

**కడెం:** క్రిమిసంహారక నీటిని తాగి జీవాలు మృత్యువాతపడిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. దిల్దార్‌నగర్ గ్రామానికి చెందిన జక్కుల కొమురవెల్లి తన మేకలు, గొర్రెలను ఆదివారం తోకల రవీందర్ మొక్కజొన్న తోట సమీపంలోకి మేతకు తీసుకెళ్లాడు. అక్కడ ఉన్న క్రిమిసంహారక నీటిని తాగి ఆరు మేకలు, రెండు గొర్రెలు, ఒక మేక పిల్ల మృతి చెందింది. రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం పరిహారం చెల్లించి ఆదుకోవాలని బాధిత రైతు వేడుకున్నాడు.